# గురజాడ వారి విశ్వమానవ ప్రేమ

డా. ఝాన్సీ వాణి, తెలుగు శాఖాధ్యక్షులు, బాపట్ల కాలేజ్ అఫ్ ఆర్ట్స్ & సైన్స్, ఆం.ప్ర.

విశ్వంలో ఉన్న మానవులందరినీ కులమతాలకు, భాషలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రేమించడమే విశ్వమానవ ప్రేమ. అయితే ఈ భావం అలవడడం అంత సులభం కాదు. విశాల దృక్పథం, ఉన్నత సంస్కారం ఉత్తమ వ్యక్తిత్వం ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. ఈ భావజాలం కొందరికి జన్మత: సంస్కారమైతే కొందరికి మహానుభావుల, మహాకవుల ఉపదేశాలు, సందేశాలు వినడం వల్లనో, చదవడం వల్లనో అలవడుతుంది. తద్వారా వారికి ఈ ప్రపంచానికి శాంతి చేకూరుతుంది. లేదంటే అల్లకల్లోలం, రక్తపాతం. ఇటీవల మన రాష్టం లోను, దేశంలోను జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే మనది పురోగమనమా? తిరోగమనమా? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఎవరో కొందరు అజ్ఞానులు మూర్ఖంగా, రాక్షసంగా ప్రవర్తించినంత మాత్రాన అందరినీ ఒక గాటిన కట్టేయడం సరికాదు గాని కడివెడు పాలల్లో ఒక విషపు చుక్క లాగా అయిపోతుంది పరిస్థితి.

మనల్ని మనం సంస్కరించుకుంటూ మన చుట్టూవున్న వారిని సంస్కరించడానికి మన వంతు ప్రయత్నం మనం చేపట్టాలి. నిజానికి ఇటువంటి సంస్కరణలకు పునాదులు ఏనాడో ఏర్పడ్డాయి. వివిధ రూపాల్లో కొనసాగిన ఈ సంస్కరణల్లో సాహిత్య రూపానిదే పెద్దపీట. "హితేన సహితం సాహిత్యం"- హితాన్ని, ధర్మాన్ని బోధించేదే సాహిత్యం. ఏ సాహిత్యానికైనా ఇదే పరమార్ధం. తెలుగు సాహిత్యం కూడా ఈ ముఖ్యోద్దేశంతోనే ఆవిర్భవించి, వ్యాప్తి చెందింది. అటువంటి తెలుగు సాహిత్యంలో వేగుచుక్కలా కాంతులీనుతూ ఎందరికో దిశానిర్దేశం చేసి మార్గదర్శకుడైన హేతువాది, మానవతావాది గురజాడ ఆద్యుడు. వారి రచనలను మరోమారు పునశ్చరణ చేసుకొని తద్వారా మనలను, మన సమాజాన్ని ప్రక్షాళన చేసుకోవచ్చనే ఆశాభావమే నా యీ ప్రయత్నం.

జన సామాన్యుల సమస్యలకు స్పందించి, వాటిని ఖండించి, సంస్కరించడానికి నడుంబిగించిన గురజాడ ఏక కాలంలో భాషా సంస్కరణ, సాంఘిక సంస్కరణలు చేపట్టి సవ్యసాచిలా నిలిచారు. 'ముత్యాల సరాలు' లో గురజాడ వారికున్న విశ్వమానవ ప్రేమ, వసుధైక కుటుంబ వాంఛ, మూఢ విశ్వాస నిరసన, శాస్త్రీయ దృక్పథం గోచరిస్తుంది. జాతి, మత భేదాలు దేశ పురోగతికి అవరోధాలుగా భావించి

'లవణరాజుకల' ఖండికలో ప్రాచీన వర్ణవ్యవస్థను ఖండిస్తూ చక్కటి బోధ చేసారు.

మలిన దేహుల మాలలనుచు
మలిన చిత్తులకధిక కులముల
నెలవొసంగిన వర్ణ ధర్మమ
ధర్మదర్మంబే!

అంటూ నిలదీయడంతో పాటు

"మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచి యన్నది మాలయైతే
మాలనే అగుదున్"

అంటూ రాజు పాత్ర ద్వారా పలికించడంతో హరిజనోద్ధరణ ఉద్యమానికి నడుంబిగించారు గురజాడ. తన భావాలను స్వచ్ఛంగా, స్పష్టంగా, ప్రస్ఫుటంగా ప్రబోధాత్మకంగా చెప్పగలగిన గుండెధైర్యం కలవాడు గురజాడ.

రాయిరప్పల్లో, కొండకొనల్లో దేవుడు లేడని మనిషిలోనే దేవుడున్నాడనే జ్ఞానాన్ని 'మనిషి' అనే గేయంలో వ్యక్తం చేసాడు.

మనిషి చేసిన రాయిరప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయిరప్ప
కన్న కనిష్టం
గాను చూస్తావేల, బేలా?
దేవుడెక్కడో దాగెనంటూ
కొండకోనల వెతుకులాడే
వేలా?
కన్ను తెరిచిన కానబడడో?
మానవ మాత్రుడియందులేడో?
యెరిగికోరిన కరిగియీడో
ముక్తి?

రాయి రప్పల కంటే తోటి మానవులను హీనంగా చూడడాన్ని నిరసిస్తూ మతాల కన్నా మానవత్వమే గొప్పదని చాటారు. హేతువాద దృష్టితో ఆలోచించడంలో వేమనకు సాటి అనిపించారు.

'మీపేరేమిటి' అనే కథానిక మత సామరస్యాన్ని చాటి చెబుతుంది. హైందవ మతానికి చెందిన శైవులు, వైష్ణవుల మధ్య వున్న విభేదాలు ఇందులో కన్పిస్తాయి అగ్నిగుండం తొక్కే విషయంలో శైవులకు, వైష్ణవులకు మధ్య వాదన జరుగుతు ఉంటుంది. అప్పుడు నాంచారమ్మ సూచన మేరకు పీరు సాయిబును అగ్నిగుండం తొక్కమంటారు. ముసుగులు ధరించిన కొందరు అగ్నిగుండం దాటుతారు. వారిలో ముందుండే వ్యక్తి చేతిలో ఒక వెండి పీరు ఉంటుంది. శరభయ్య అనే అతను 'శైవ వైష్ణవ బేధం లేకుండా పీరు దేవరకు మొక్కులు చెల్లిస్తారు' అని అంటాడు అప్పుడు వెంకయ్య పంతులు 'శివుడు విష్ణువు పీర్లే అయినప్పుడు బుద్ధుడు  శివుడు కారాదా? అంటాడు' ఔరా కలి కాలంలో మనుష్యులే కాదు దేవుళ్ళు కూడా సంకరం అవుతున్నారు. అయినా తప్పేమిటి శివుడన్నా, విష్ణువన్నా, పీరన్నా, బుద్ధుడన్నా అపరమాత్మ మట్టుకు ఒక్కడేగదా! అని గురువన్నప్పుడు వెంకయ్య ఊరుకోకుండా "అందరూ దేవుళ్ళు ఒక్కరే అయితే ఆ పీనుగుల్ని అందరిని ఒక్క చోటే నిలిపి అందరూ కలసి పూజ తగలెట్టరాదా"* అంటాడు. అందరూ దేవుళ్ళూ ఒకటే అనే పరమ సత్యాన్ని గురజాడ బోధించే ప్రయత్నం చేస్తూ చివరకు "దేవుడు చేసిన మనుషుల్లారా, మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటి?" అని నిలదీస్తాడు. మత మౌఢ్యాన్ని ఖండించే చక్కటి కథానిక ఇది.

హిందూ, ముస్లీంల వైషమ్యాలు, మూఢవిశ్వాసాలు ప్రతిఫలించే కథలు "మతము-విమతము", "పెద్దమసీదు". వీటిలోనూ మతం కన్నా ప్రేమేమిన్న అని చాటారు గురజాడ. 'కన్యక' గేయంలోనూ కులం కన్నా గుణం మిన్న అన్న సందేశాన్ని అందించారు. ఈ విధంగా ఆధునిక యుగంలో తెలుగు సాహిత్యానికి కొత్త మార్గాన్ని చూపించి వైతాళికులనే మేల్కొలిపిన వైతాళికుడు గురజాడ.  ప్రజల్లో అనాదిగా గూడు కట్టుకున్న కొన్ని అనాచారాలను తన విప్లవాత్మక మార్పులతో పారద్రోలడానికి దీక్ష చేబూనారు.

సమాజంలో మంచిని పెంచడం కోసం గురజాడ ఎంతో ఆరాటపడ్డారు. తన రచనల ద్వారా, స్వయంగా కొన్ని సంస్కరణ కార్యక్రమాలను చేపట్టడం ద్వారా గురజాడ ఎందరికో అడుగుజాడ అయ్యాడు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు గాలిలోను, ధూళిలోను కలిసిపోకూడదు. తెలుగువారి స్మృతి పథంలో సదా గురజాడ వారు జీవించి ఉండాలంటే అతన్ని మనం స్మరించుకోవడం ఒకటే కాదు. ఆయన చూపిన మార్గంలో త్రికరణశుద్ధిగా నడవ గలగాలి.

---

* గురజాడ రచనలు- పుట సంఖ్య 17

"ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును
ప్రేమనిలిపిన ప్రేమ నిలుచును"

అని 'కాసులు' గేయంలో గురజాడ వారన్నట్లు కులమతాలకతీతంగా తోటి మానవులను మనవలే ప్రేమించినప్పుడు విశ్వశ్రేయస్సు కలుగుతుంది.

బ్రతికి చచ్చియు ప్రజల కెవ్వడు
బ్రీతి గుర్చునో వాడే ధన్యుడు

అని 'డామన్ పితయస్' లో గురజాడ వారన్న రత్నాల్లాంటి మాటలు ఆయనకే వర్తిస్తాయి. 'ధన్యజీవి గురజాడ' - అందులో ఎటుదంటి సందేహం లేదు. వారి విశ్వమానవ ప్రేమ అనే ప్రగాఢ వాంఛ సాకారం చేయడానికి చెట్టపట్టాల్ వేసుకొని దేశస్థులంతా నడుద్దాం అప్పుడు మతములన్ని మాసిపోయి జ్ఞాన మొక్కటే నిలిచి వెలుగుతుంది.

ఉపయుక్త గ్రంధాలు :

1. గురజాడ రచనలు - సెట్టిఈశ్వరరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్ విజయవాడ-4.
2. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు : ప్రయోగములు (ప్రధమ ముద్రణ) డా॥ సి. నారాయణరెడ్డి, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్టిబ్యూటర్స్, సికింద్రాబాద్, మచలీపట్నం
3. ఆధునిక కాంధ్రకవులు - డా॥ బి. జయరాములు - నవరత్నబుక్ హౌస్, విజయవాడ